క్లుప్తంగా

వైఎస్సార్ వర్ధంతి రేపు

ఉదయగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఉదయగిరిలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరిలో జరిగే కార్యక్రమానికి అన్ని మండలాల పార్టీ శ్రేణులు తరలి రావాలని కోరారు. కాగా ఉదయగిరి నియోజకవర్గంలోని వాడవాడలా మహానేతకు ఘనంగా నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుడి మృతిపై సంతాపం

ఉదయగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నల్లబోతుల వెంకటరమణ (45) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం నందిపాడులోని స్వగృహంలో ఉంచిన వెంకటరమణ భౌతికకాయాన్ని ఎంఈఓలు టీ శ్రీనివాసులు, టీ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆత్మకూరు నియోజకవర్గ బీఎస్పీ ప్రధాన కార్యదర్శి శేషాద్రి పిలుపునిచ్చారు. పట్టణంలో బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం మండల ఉపాధ్యక్షుడిగా పొంగలూరు చెన్నకృష్ణయ్య, కార్యదర్శులుగా గంటా మహేష్, కరేటి నారాయణమూర్తిని ఎంపిక చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు



ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీసీకాలనీవాసులు పొంగళ్ల సామగ్రిని కొత్తగంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా పోలేరమ్మ గుడి వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామంసుభిక్షంగా ఉండాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన 39 మంది అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి నుంచి రూ.50 లక్షల నగదు చెక్కులు మంజూరయ్యాయి. ఆదివారం వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

ఉదయగిరి జిల్లా సాధనకు సహకరించండి



ఉదయగిరి రూరల్ : వెంకటాచలంలో మాజీ రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడును ఉదయగిరి జిల్లా సాధన కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. ఉదయగిరి కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని చేపడుతున్న ఉద్యమానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న నేపథ్యంలో ఉదయగిరి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ఉన్నందున కొత్త జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని వెంకయ్యనాయుడును కోరారు. ఎల్‌సీ రమణారెడ్డి,మూలే బాలకృష్ణారెడ్డి, పాముల రమణయ్య, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తా


నెల్లూరు(బృందావనం): పుర మందిరంలో గత మూడు రోజులుగా జరిగిన తెలుగుభాషా ఉత్సవాల మహాసభల్లో ప్రతిపాదించిన 11 తీర్మానాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన అంశాలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పురమందిరంలో ఆదివారం రాత్రి తెలుగు భాషోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో పాల్గొన్న తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ తెలుగుభాషా పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని పలు అంశాలను ప్రస్తావించారు. ముగింపు సభకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

స్కాన్ చేసేయ్.. పాఠాలు వినేయ్

- దీక్ష యాప్‌లో ఎన్సీఈఆర్టీ, స్టేట్‌సిలబస్‌లు
- అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్రతిపుస్తకంపై క్యూఆర్ కోడ్ ముద్రణ
- స్కాన్ చేస్తే సెల్‌ఫోన్ తెరపై పాఠ్యాంశాలు



సెల్‌ఫోన్‌లో పాఠాలు వింటున్న విద్యార్థిని



క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన పాఠ్య పుస్తకాలు

సీతారామపురం : విద్యార్థులు అనారోగ్యంతో బడికి వెళ్లకున్నా, బడికెళ్లినా పాఠాలు సరిగా వినకున్నా, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సరిగా అర్థం కాకున్నా విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారు. అలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం దీక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో ఎన్సీఈఆర్టీతో పాటు స్టేట్ సిలబస్‌లను పొందుపరిచింది. విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాలను సెల్‌ఫోన్ ద్వారా చదువుకునేలా రూపకల్పన చేసింది.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే...

జిల్లాలో 2,517 పాఠశాలలతో పాటు 11 ఆదర్శ, 12 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 1.72 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సరఫరా చేసిన అన్ని పాఠ్య పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేలా వాటిని నిపుణుల ద్వారా దీక్ష యాప్‌లో పొందుపరిచారు. ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అర్థం కాని పాఠ్యాంశాన్ని సులువుగా చదివే వెసులుబాటు కల్పించారు. ఎన్సీఈఆర్టీ, స్టేట్ సిలబస్ పుస్తకాలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంచారు. ఆడియో, వీడియో, క్విజ్, అసైన్మెంట్ సౌకర్యం కల్పించారు. ప్రత్యేకావసరాల పిల్లలకు ఆడియో పాఠాలు ఎంతో ఉపయోగపడుతాయి. నిఘంటువులో పదివేల పదాలు ఉన్నాయి.

యాప్ డౌన్‌లోడ్ ఇలా....

దీక్ష యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత అందులోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే వెంటనే పాఠ్యాంశం తెరపై కనిపిస్తుంది.

మళ్లీ పాఠాలు వినొచ్చు



తరగతి గదిలో సక్రమంగా పాఠాలను వినని విద్యార్థులు మళ్లీ ఇంటి వద్ద దీక్ష యాప్ ద్వారా సెల్‌ఫోన్‌లో పాఠాలు వినొచ్చు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులకు దీక్ష యాప్ ఎంతగానో దోహదపడుతుంది. దీనిపై తరగతి గదుల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

–సమీరారెడ్డి, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, సీతారామపురం.

ఎంతో ప్రయోజనం



దీక్ష యాప్‌లో పాఠాలు ఆడియో, వీడియో రూపంలో ఆసక్తికరంగా ఉంటాయి. విద్యార్థి ఎప్పుడైనా తరగతి గదిలో చెప్పిన పాఠాన్ని ఇంటి వద్ద ఫోన్ ద్వారా మరోసారి వినొచ్చు. తద్వారా ఆ అంశంపై పట్టు పెరుగుతుంది. ఈ యాప్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయులు మరింత అవగాహన కల్పించాలి.

– షేక్ మస్తాన్‌వలీ, ఎంఈఓ, సీతారామపురం.

బాధిత చిన్నారులకు మేకపాటి పరామర్శ



బాధిత చిన్నారులను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: మండలం అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా బాణసంచా పేలిన ఘటనలో పలువురు చిన్నారులు గాయపడిన విషయం తెలిసిందే. ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారులను ఉదయగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఉపాధి వేతన బకాయిలను చెల్లించాలి



సోమశిల: ఉపాధి కూలీలకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. అనంతసాగరం మండల వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభను ఆదివారం నిర్వహించారు. అనంతసాగరంలోని అతిథి గృహం ఆవరణలో నిర్వహించిన మహాసభలో మంగళ పుల్లయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడుతుందన్నారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్ష, కార్యదర్శులుగా బందుల వెంకటరమణ, నాగులూరు వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, జేవీవీ నాయకులు గాడి సుధాకర్, రైతు సంఘ నాయకులు ఉప్పలపాడు మస్తాన్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనోత్సవంలో అప్రమత్తంగా ఉండాలి



గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న సీఐ

ఉదయగిరి: ఉదయగిరి సర్కిల్ పరిధిలో గణేశ్ మండపాల నిర్వాహకులు గణేష్ నిమజ్జనోత్సవంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకట్రావు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవ కమిటీలతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గణేశ్ నిమజ్జం సందర్భంగా అప్పసముద్రం, గుడ్లదొన గ్రామాల్లో ప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు.వీటిని దృష్టిలో ఉంచుకుని బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

నాగేంద్ర సేవలు ఏనలేనివి



ఆత్మకూరు: ఉపాధ్యాయుడుగా కర్రా నాగేంద్ర రావు అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని ఆదిఆంధ్ర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కర్రా నాగేంద్రరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సభలో కర్రా దంపతులను పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాగేంద్రరావు ఎందరో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారని, ఆయన శిష్యులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నారని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధిత చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సుబ్బారెడ్డి

ఉదయగిరి: మండలం అప్పసముద్రంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చోటు చేసుకున్న బాణసంచా పేలుడులో గాయపడిన చిన్నారుల కుటుంబాలను రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.1.20లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. అప్పసముద్రంలో ఉన్న ముగ్గురు చిన్నారులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున అందజేశారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు చిన్నారులను పరామర్శించి ఒక్కొకరికి రూ.20వేలు వంతున సాయం అందజేశారు. అనంతరం నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మరో చిన్నారికి రూ.25వేలు, స్వల్పంగా గాయపడిన మరొకరికి రూ.5వేలు చొప్పున నగదు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిబోయిన శ్రీనివాసులు, కల్లూరు రాజారెడ్డి, ఉప్పుటూరి హరి, జీ నరేంద్ర తదితరులు ఉన్నారు.

గణేశ్ లడ్డూ రూ.2.15 లక్షలు



సీతారామపురం: లడ్డూను దక్కించుకున్న యువత



ఆత్మకూరు: లడ్డూను దక్కించుకున్న దంపతులు

సీతారామపురం: స్థానిక పోతురాజు సెంటర్‌లోని వినాయకుని మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ, కలశం వేలం పాటను ఆదివారం నిర్వహించారు. వేలంలో లడ్డూను అల్లిక వీధికి చెందిన తోట మనోజ్ రూ.2.15 లక్షలు, కలశాన్ని తోట మహేష్ రూ.1.15 లక్షలకు దక్కించుకున్నారు.

గణేశ్ లడ్డూ రూ.1.31 లక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని నారాయణరావుపేటలో గణేశ్ మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంలో బొబ్బల చిన్నయ్య, ధనమ్మ దంపతులు లడ్డూను రూ.1.31 లక్షలకు దక్కించుకున్నారు. వారిని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. స్థానిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లడ్డూను దక్కించుకున్న ముస్లిం సోదరులు



లడ్డూను దక్కించుకున్న ముస్లింలు

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లోని వినాయకుడి ప్రతిమ వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటను ఆదివారం నిర్వహించారు. వేలంలో ముస్లిం సోదరులు లడ్డూను రూ.28,500కు దక్కించుకున్నాడు.

ఆలయాల్లో విశేష పూజలు



సంగం: మండలంలోని తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవి, కోలగట్లలోని నాగార్పమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. రాజరాజేశ్వరిదేవికి పవిత్ర పెన్నానది జలాలతో అభిషేకాలు చేసి పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలగట్లలోని నాగార్పమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

శాకాహార సద్భావన ర్యాలీ



సంగం: మండల కేంద్రమైన సంగంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మహాకరుణ శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం చేపట్టారు. వెంకయ్యస్వామి ఆలయం నుంచి రాజరాజేశ్వరీదేవి ఆలయం వరకు ర్యాలీని నిర్వహించి శాకాహారంపై అవగాహన కల్పించారు. మూగజీవులపై కరుణ చూపించాలని, శాకాహారం ఆరోగ్యానికి ఎంతో మేలని, ప్రతిఒక్కరూ మాంసాహారాన్ని వదిలి శాకాహారం వైపు మొగ్గు చూపాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆదూరుపల్లెమ్మకు పొంగళ్లు



పూలతో అలంకరించిన ఆదూరుపల్లెమ్మ ఆలయం



పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు వస్తున్న గ్రామస్తులు

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం ఆదూరుపల్లిలో గ్రామదేవత ఆదూరుపల్లెమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఆదూరుపల్లెమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు. తిరునాళ్ల సంప్రదాయంలో భాగంగా మూడు ఆదివారాలు భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా తొలి ఆదివారం అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. మహిళలు సామూహికంగా కొత్త గంపల్లో పొంగళ్ల సామగ్రిని పెట్టుకుని మేళతాలల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారధి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి మరమ్మతులతో భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. అయినా పాలకులు ,అధికారులు నిర్లక్ష్యం వహించడంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం రూపురేఖలు కోల్పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ భవనానికి మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సును ఢీకొన్న కారు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఉదయగిరి: బస్సును అతివేగంగా వస్తున్న కారు ఢీకొన్న ఘటన ఉదయగిరి–సీతారామపురం రోడ్డు మార్గంలో ఉదయగిరి జంక్షన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..సీతారామపురం నుంచి ఉదయగిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉదయగిరి జంక్షన్ వద్దకు రాగానే నందిపాడు నుంచి నేలటూరు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి ముందుభాగంలో బలంగా ఢీకొంది. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయడం, కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం బాగా దెబ్బతింది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సీతారామపురంలో భక్తజన కోలాహలం నడుమ నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

గణేశ్ నిమజ్జన కోలాహలం

వింజమూరు(ఉదయగిరి)/ సీతారామపురం/ అల్లూరు/మర్రిపాడు/కలిగిరి: ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జన కోలాహలం నెలకొంది. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిమలకు ఉదయం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం డీజే, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని జల వనరుల్లో నిమజ్జనం చేశారు.



మర్రిపాడు: డీసీపల్లిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



కలిగిరి: ఉత్తరకాలువలో వినాయకుడి నిమజ్జనం



అల్లూరు చెరువు కలుజు వద్ద గణనాథుడి నిమజ్జనం చేస్తున్న భక్తులు



వింజమూరులో గణనాథుడి ఊరేగింపు